క్లుప్తంగా

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



విద్యార్థుల వివరాలు అప్‌డేట్ చేస్తున్న వైద్య సిబ్బంది

మొగల్తూరు: రాష్ట్రీయ బాల ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం 44 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి వారి వివరాలను అప్‌డేట్ చేశామని మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి ఆరోగ్య కార్యదర్శి డి.మేరీ పుష్పరాజ్యం తెలిపారు. ప్రతి రోజూ మండలంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కె.సాంబశివరావు, ఆశ కార్యకర్త కె.దుర్గ తదితరులు పాల్గొన్నారు.

కుంగుతున్న గోదావరి గట్టు రోడ్డు

నరసాపురం: పట్టణంలోని గోదావరి గట్టు రోడ్డు ధ్వంసమవుతోంది. పడవలరేవు నుంచి కొండాలమ్మగుడి వరకూ రోడ్డుకు పలు చోట్ల గోతులుపడ్డాయి. రోడ్డు చాలాచోట్ల కుంగిపోయింది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తూ ఉంటారు. ముఖ్యంగా మార్నింగ్ వాక్ చేసే వారితో పాటు సాయంత్రం వేళలో గోదావరి తీరానికి విహారానికి పెద్ద సంఖ్యలో జనం వస్తుంటారు. రోడ్డు సవ్యంగా లేకపోవడంతో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు రోడ్డు మరమ్మతులను చేయించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

వైభవంగా గణపతి హోమం



గణపతి హోమంలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి రామాలయం సెంటర్‌లో అయ్యప్పస్వాములు గణపతి హోమం నిర్వహించారు. శనివారం వేకువ జామున మారుతి గురుస్వామి పీఠం ఆధ్వర్యంలో రామాలయంలో అయ్యప్ప దీక్షా దారులు గణపతి హోమంలో పాల్గొన్నారు. పురోహితులు కడియాల శ్రీనివాసు బ్రహ్మత్వంలో హోమం నిర్వహించారు. ఆదివారం ఇరుముళ్లు కట్టుకుని స్వామి సన్నిధికి బయలు దేరుతున్నట్లు మారుతీ గురుస్వామి తెలిపారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



ఇలపర్రు జెడ్పీ పాఠశాలలో వరల్డ్ టాయిలెట్ డే నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: వ్యక్తి గత శుభ్రతను పాటించడం చిన్ననాటి నుంచి అలవాటు చేసుకోవాలని ఎంఆర్‌సీ బాబ్జీ అన్నారు. శనివారం ఇలపర్రులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వరల్డ్ టాయిలెట్స్ డే నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తి గత మరుగుదొడ్లు వినియోగించుకోవాలన్నారు. బహిర్భూమికి వెళ్లడం వల్ల వాతావరణ కాలుష్యంతో పాటు, రోగాల వ్యాప్తి జరుగుతుందన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహనతో ఉండాలన్నారు.

నేడు యూత్ హాస్టల్స్ ఎన్నికలు

పాలకొల్లు సెంట్రల్: యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పాలకొల్లు యూనిట్ కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించనున్నట్లు యూనిట్ కార్యదర్శి కారుమూరి సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలు ఎదురుగా ఉన్న యూత్ హాస్టల్స్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి యూత్ హాస్టల్స్ జీవిత కాల సభ్యులు, అర్హత ఉన్న సాధారణ సభ్యులు హాజరుకావాలని కోరారు. మూడేళ్లకు ఒకసారి ఈ యూత్ హాస్టల్స్ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు.

నేడు మార్టేరులో రెడ్డి సేవా సంఘం కార్తీక వన సమారాధన

పెనుమంట్ర: మార్టేరు పంచగ్రామ రెడ్డి సేవా సంఘం కార్తీక వన సమారాధన మహోత్సవం ఆదివారం స్థానిక రెడ్డి కల్యాణ మండప ఆవరణలో జరుగుతుందని సేవా సంఘం అధ్యక్షులు కేకేఆర్ చంద్రశేఖర్‌రెడ్డి ,జిల్లా కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మారెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి పలువురు రెడ్డి ప్రతినిధులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో టెన్త్, ఇంటర్ ఫలితాలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన రెడ్డి కుటుంబ సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

చెత్త నుంచి సంపద ఏదీ?

- వర్మీ కంపోస్టు యార్డులు నిరుపయోగం
- గ్రామాల్లో అలంకారప్రాయంగా మారిన వైనం



రామన్నపాలెంలో నిరుపయోగంగా పడిఉన్న కంపోస్ట్ యార్డు



మొగల్తూరులో బోసిగా కన్పిస్తున్న సంపద కేంద్రం

మొగల్తూరు: 2019ల టీడీపీ ప్రభుత్వం అధికారంలకి రాగానే ప్రతి చెత్త నుంచి సంపద సృష్టిస్తామంటూ ప్రతి గ్రామంలో ఆర్భాటంతో వర్మీ కంపోస్ట్ యార్డులు నిర్మించారు. ఘన వ్యర్థాల నుంచి సంపద కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించడంతో ప్రతి గ్రామంలోను సంపద కేంద్రాల పేరుతో వీటిని ఏర్పాటు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటిస్తూ పరిసరాల పరిశుభ్రతపై సుదీర్ఘంగా ప్రసంగాలు, సమావేశాలతో హడావిడి చేశారు. చెత్తను ఎత్తివేసేందుకు సిబ్బందిని, రిక్షాలను ఏర్పాటు చేసుకోవాలని అధికారులు ఆదేశించారు.

రూ.లక్షల ఖర్చు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో వర్మీ కంపోస్ట్ కేంద్రాలను గ్రామాల్లో రూ.3 నుంచి రూ.9 లక్షలు వెచ్చించి నిర్మించారు. రామన్నపాలెంలో రూ.10 లక్షలు, మొగల్తూరులో సుమారు రూ.15 లక్షలు వెచ్చించి సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామాల్లోని చెత్త, చెదారాలు ఎత్తి సంపద కేంద్రాలకు తరలించి అక్కడ తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయాలి. చెత్తను తరిలించేందుకు రిక్షాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించడంతో పంచాయతీల ఆదాయం అంతంత మాత్రంగా ఉండడంతో అప్పటి పాలకవర్గాలు ముందుకు రాలేదు. పంచాయతీరాజ్ శాఖ, గ్రామ పంచాయతీలు చెరి సగం భరించాలని సూచించడంతో తప్పనిసరి పరిస్థితిలో పంచాయతీలు అంగీకరించడంతో ఒక్కోటి రూ.1.20లక్షలు ఖరీదైన బ్యాటరీ రిక్షాలు అందించారు.

రిక్షాలున్నా సిబ్బంది లేరు

మండల కేంద్రమైన మొగల్తూరు పంచాయతీకి తప్ప ఏ గ్రామంలోను పారిశుద్ధ్య సిబ్బంది లేరు. రిక్షాలు ఉన్నా సిబ్బంది లేకపోవడంతో గ్రామాల్లో చెత్త, చెదారాలు దర్శనమిస్తున్నాయి. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన సంపద కేంద్రాలు వృథాగా పడిఉన్నాయి. మండల కేంద్రమైన మొగల్తూరులో చెత్త ఎత్తివేసేందుకు సిబ్బంది ఉన్నా చెత్తను వేరు చేసే నాథుడు లేకపోవడంతో గ్రామంలో నిర్మించిన సంపద కేంద్రం నిరుపయోగంగా పడి ఉంది.తాటాకులతో నిర్మించిన కేంద్రలో తాటాకులు గాలికి ఎగిరిపోవడంతో దిమ్మలు తప్ప ఏమీ కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీల్లో సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకువాలని ప్రజలు కోరుతున్నారు.

లక్షలు వెచ్చించినా నిరుపయోగం



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పంచాయతీ ఆదాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా నిర్మించారు. పంచాయతీకి సిబ్బంది లేకపోయినా లక్షలు వెచ్చించి నిర్మించడంతో నిరుపయోగంగా పడిఉంది. అధికారులు స్పందించి సంపద కేంద్రాలు ఉపయోగపడేలా సిబ్బందిని నియమించి ఉపయోగంలోకి తీసుకురావాలి.

– అద్దాల సాంబమూర్తి, లక్కువారితోట

వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు



నరసాపురం: మండలంలోని వేములదీవి కాపుల కొడప గ్రామంలో ఉన్న శ్రీ వైభవ వేంకటేశ్వర స్వామిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీరాముడు అంజనేయ స్వామిని ఆలింగనం చేసుకున్నట్టుగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజలు చేశారు. దూరప్రాంతాల నుంచి కూడా తీర గ్రామంలో వెలసిన వేంకటేశ్వరస్వామిని దర్శించి పూజలు చేశారు. దీంతో తెల్లవారు జాము నుంచి ఆలయం వద్ద రద్దీ నెలకొంది.

మొగల్తూరులో..

మొగల్తూరు: స్థానిక భూసమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసం కావడంతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకున్న భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

ధాన్యం తడిచిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



మొగల్తూరులో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రాజకిషోర్

మొగల్తూరు: ధాన్యం తడిచిపోకుండా రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తహసిల్దార్ కె.రాజ కిషోర్ సూచించారు. శనివారం మొగల్తూరులోని హరిప్రియ రైస్ మిల్లును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా వెంటనే దిగుమతి చేసుకుని రైతులకు రశీదులు అందజేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలు ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు వచ్చాక ఎలాంటి ఆలస్యం చేయకుండా దిగుమతి చేసుకోవాలని కస్టోడియన్ అధికారులకు, మిల్లు గుమాస్తాలకు స్పష్టం చేశారు. వాతావరణంలో మార్పులు కారణంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో రైతులు ధాన్యం తడిసిపోకుండా బరకాలు కప్పడం లేదా సురక్షిత ప్రవేశంలో ఉంచేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల నుంచి ఇప్పటివరకు 1200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మిల్లు యజమానులు తహసీల్దార్‌కు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ దూసనపూడి సత్యనారాయణ, వీఆర్‌ఏ గణేష్, మిల్లు గుమాస్తా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

మొగల్తూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన 99,116 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కె రాజకిశోర్ శనివారం పరిశీలించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు డిసెంబర్ 5న జరుగునున్న నేపద్యంలో ఆయన స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం వి.రవిశంకర్ సర్కార్ ఉన్నారు.

స్పీడు బ్రేకర్లు వేయాలి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్‌ఆర్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతీ రోజూ ఏవో ప్రమాదాలు జరుగుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం మీదుగానే వెళ్లాలి. ముఖ్యంగా పలు కళాశాలల విద్యార్థులు నిత్యం ఈ మార్గంలోనే ప్రయాణిస్తారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో రద్దీ విపరీతంగా పెరిగిపోయింది. రద్దీగా ఉండే ఈ ప్రాంతం గుండా వాహనాలు మితిమీరిన వేగంతో వెళుతుండడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మిస్తే పరిస్థితి కాస్త మెరుగవుతుందని, మున్సిపాలిటీ అధికారులు స్పందించి స్పీడు బ్రేకర్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు చదరంగం పోటీలు

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపికలో భాగంగా పాలకొల్లు పట్టణంలో చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షులు మాదాసు కిషోర్ తెలిపారు. శనివారం కిషోర్ విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం 8 గంటలకు పాలకొల్లు బ్రాడీపేట బైపాస్ రోడ్డులో ఉన్న యూరో కిడ్స్ స్కూల్‌లో జిల్లా ర్యాపిడ్ అండ్ బ్లిట్జ్ చదరంగం పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో గెలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు చెస్ బోర్డులు వారే తెచ్చుకోవాలని సూచించారు. అలాగే పోటీలో పాల్గొనడానికి ఎంట్రీ ఫీజు రూ. 300 చెల్లించాలన్నారు. పూర్తి వివరాల కోసం 90632 24466కు ఫోన్ చేయాలని సూచించారు.

6 నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు శ్రీవేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో డిసెంబరు 6 నుంచి 9 వరకు పురుషులు, మహిళా జట్టుకు అంతర్‌జిల్లాల ఎమ్మెల్యే కప్ బాస్కెట్‌బాల్స్ పోటీలు జరుగుతాయని మార్టేరు యూత్ బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు చిర్ల బాలాజీరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు సంబంధించి ఆదివారం మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా క్రీడాకారుల ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సెలక్షన్‌లో జిల్లాలోని బాస్కెట్‌బాల్ క్రీడాకారులంతా పాల్గొనవచ్చని ఆయన స్పష్టం చేశారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్

పాలకొల్లు సెంట్రల్: నేటి యువత డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేయాలని పట్టణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల విద్య అంటే ఆకర్షణీయమైన టీనేజీ వయస్సని అన్నారు. విద్యార్థి దశలో ప్రతి విద్యార్థి ఏకాగ్రతతో మెలగాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడకుండా కెరీర్ గైడ్ వైపు మాత్రమే దృష్టి కేంద్రీకరించాలన్నారు. మనిషి జీవితం నాశనం చేసుకోవడానికి ఒక్క నిమిషం సరిపోతుందని అదే బాగుచేసుకోవాలంటే చాలా కష్టపడాలని అన్నారు. ఏదైనా తప్పు చేసేటప్పుడు ఒక్కసారి మన కోసం మన తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. మంచి కన్నా చెడు అత్యంత వేగంగా ఆకర్షిస్తుందనే విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై జి.రఘు, ప్రిన్సిపాల్ వీకే మల్లేశ్వరరావు, అధ్యాపకులు కె.మురళీకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఏఎస్ఎస్ రమణ కుమార్, పీఎల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అదానీని అరెస్ట్ చేయాలి



నరసాపురం: అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

నరసాపురం: అవినీతి కార్పొరేట్ దిగ్గజం అదానీని అరెస్ట్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు డిమాండ్ చేశారు. శనివారం అదానీ అరెస్ట్ కోరుతూ అంబేడ్కర్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పెద్దిరాజు మాట్లాడుతూ సౌర విద్యుత్ ఒప్పందాల్లో అదానీ భారీగా ముడుపులు చెల్లించారని అమెరికా ప్రభుత్వం బయటపెట్టడంతో మనదేశ పరువు అంతర్జాతీయంగా పోయిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అదానీ విషయాన్ని కనీసం ప్రస్తావించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. కెన్యా, బంగ్లాదేశ్ ప్రభుత్వాలు ఇప్పటికే అదానీతో చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకున్నాయన్నారు. ప్రధాని మోదీ వెనకుండడం వల్లే అదానీ ఆటలు మన దేశంలో సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పొగాకు నారాయణరావు, కె.వెంకటేశ్వరరావు, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

ఆచంటలో..

పెనుగొండ: అదాని గ్రూపు పాల్పడిన అవకతవకలన్నింటిపైనా స్వతంత్ర సంస్థలతో పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి పరుపు మోహన రావు డిమాండ్ చేశారు. శనివారం ఆచంట కచేరీ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అదానిని అరెస్ట్‌చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు తలుపూరి బుల్లాబ్బాయి, ఎస్‌వీఎస్ శర్మ, కుసుమే జయరాజు పాల్గొన్నారు.

పెనుగొండలో

అదానీని అరెస్ట్ చేయాలంటూ పెనుగొండలో సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి షేక్ పాదుషా, గ్రామశాఖ కార్యదర్శి నాగిశెట్టి గంగారావు తదితరులు పాల్గొన్నారు.

మోసానికి చిరునామా చంద్రబాబు



వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: తాము అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని, వారికి నెలకి రూ.10 వేలు గౌరవ వేతనం చెల్లిస్తామని హామీ ఇచ్చి ఘోరంగా మోసం చేశారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ వ్యవస్థలో వలంటీర్లు లేరని సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామ, వార్డు సచివాలయ శాఖ మంత్రి బాల వీరాంజనేయస్వామి శాసన మండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పడం వెనుక వలంటీర్లను కూటమి ప్రభుత్వం కొనసాగించే ఉద్దేశ్యం లేదని రుజువైందని పేర్కొన్నారు. అలాగే నిరుద్యోగ భృతి అందిస్తానని హామీ ఇచ్చి అసలు ప్రతిపాదనే లేదని అసెంబ్లీలో ప్రకటించడం చూస్తుంటే మోసానికి చిరునామాగా చంద్రబాబు నిలుస్తారని దుయ్యబట్టారు. చంద్రబాబు హామీలివ్వడమే తప్ప అమలు చేయరని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా సంక్షేమ పథకాల ఊసే లేదని మండిపడ్డారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి



పెనుగొండ: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు అనిత కుమారి



యలమంచిలి: మేడపాడులో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్

పెనుగొండ: రైతులు దళారులను నమ్మి మోసపోకుండా, ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో అమ్ముకునే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పెనుగొండ తహసీల్దారు జి. అరుణకుమారి అన్నారు. శనివారం తహసీల్దారు కార్యాలయంలో రైస్ మిల్లర్లు, రైతు సేవ కేంద్ర సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సార్వా ధాన్యం మాసూళ్లు జరుగుతున్నాయని రైతులు దళారులను నమ్మకుండా క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధరను రైతులకు వివరించి రైతులు మోసపోకుండా ఆర్‌ఎస్‌లకు లేదా నేరుగా రైస్ మిల్లర్లకి అమ్ముకునేటట్లుగా రైతులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మండలంలో రైస్ మిల్లర్ల యజమానులు ఆర్‌ఎస్కే సిబ్బంది, వీపీఏలు పాల్గొన్నారు.

రైసుమిల్లుల తనిఖీ

మండలంలోని వడలిలోని రైసుమిల్లులో తహసీల్దారు అనితకుమారి ఆకస్మిక తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రం, రైతు మిల్లుల వద్ద తేమ శాతం వ్యత్యాసం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టవద్దని ఆదేశించారు.

ధాన్యానికి రూ.1725 మద్దతు ధర

యలమంచిలి: ఖరీఫ్ పంట ధాన్యం 75 కిలోల బస్తాకు రూ. 1725 మద్దతు ధర ఇస్తున్నట్లు తహసీల్దార్ గ్రంధి పవన్‌కుమార్ చెప్పారు. ఖరీఫ్ కోతలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి రైతులకు ధాన్యం కొనుగోలు గురించి పలు సూచనలు చేశారు. ధాన్యం సేకరణకు అవసరమైన 50,000 గోనె సంచులు రైతు సేవా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. ఈ పంటకు 12,092 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి, ఆర్‌ఐ యశోద, వీఆర్వో గోటేటి లక్ష్మీ నరసింహారావు తదితరులు ఉన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి జియావుద్దీన్

పాలకొల్లు సెంట్రల్: కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సామరస్యంగా తమ కేసులను రాజీ చేసుకునే కక్షిదారులకు జాతీయ లోక్ అదాలత్ ఎంతగానో దోహదపడుతుందని జడ్జి షేక్ జియావుద్దీన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జియావుద్దీన్ మాట్లాడుతూ డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజీ ఆమోదయోగ్యమైన కేసులను పరిష్కరించుకునే విధంగా న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది కోట చంటియ్య, పట్టణ, రూరల్, పోడూరు, ఆచంట, పెనుగొండ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్టేరు బస్‌స్టేషన్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘన



మార్టేరు బస్‌స్టేషన్‌లో డిజిటల్ లైటింగ్‌తో నాయకుల ఫొటోలు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు బస్‌స్టేషన్‌లో ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ నాయకుల ఫొటోలు, పార్టీ గుర్తులను కనిపించకుండా మూసేయాలి. అయితే మార్టేరు బస్టాండ్‌లోని నాయకుల చిత్రాలపై తెల్లపేపర్ మాత్రమే అంటించడంతో రాత్రి సమయంలో డిజిటల్ లైటింగ్ వెలుగులతో నాయకుల చిత్రాలు దర్శనమిస్తున్నాయి సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే పితాని ఫొటోలు రాత్రి సమయంలో స్పష్టం కనిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఎన్నికల కోడ్ అమలుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు పూటలా రక్షిత మంచినీరు

భీమవరం(ప్రకాశం చౌక్): గ్రామాల్లో రక్షిత మంచి నీటిని రెండు పూటలా అందించాలని, కుళాయిలకు మోటర్లు ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించి చివరి ప్రాంతాలకు నీళ్లు సక్రమంగా అందేలా చూడాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో గ్రామ నీరు సరఫరా, పారిశుద్ధ్య, జలజీవన్‌మిషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె అంగన్‌వాడి సెంటర్లు టాయిలెట్స్, అంగన్‌వాడి సెంటర్లులో మంచినీటి సదుపాయం, ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణాలు, మరమ్మత్తులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో మండలాలు వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో జలజీవన్ మిషన్ ద్వారా ఓహెచ్ఎస్ఆర్‌లు 998 పనులకు గానూ 554 పూర్తికావడంపై జిల్లా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఫ్లాగ్ డే స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్ ఆవిష్కరణ

సాయుధ దళాల పతాక ఆవిష్కరణ దినోత్సవం డిసెంబర్7న నిర్వహించినున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ నాగరాణి శనివారం ఈ ఏడాది ఫ్లాగ్ డే స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టిక్కర్లను, ఫ్లాగ్స్‌ను విద్యార్థులకు, వివిధ వర్గాలకు సాయుధ దళాల పతాక విరాళాల సేకరణకు అందజేస్తామన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నరసాపురం: పట్టణంలో ఆదర్శ్‌కాలనీలో చేస్తున్న పారిశుద్ధ్య పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల్లో జరుగుతున్న లోపాలను గుర్తించి పారిశుద్ధ్య సిబ్బందిని హెచ్చరించారు. పారిశుద్ధ్య పనుల్లో అశ్రద్ధ వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులను నాణ్యంగా చేసేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర త్రినాథ్ తదితరులు ఉన్నారు.